మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం
31 మే 2026
పేజీలు : 4

@mvaartanews
www.mivaartanews.com


# క్షణం క్షణం భయం భయం..
# పాలేరులో క్వారీల బాంబుల మోత.

- నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు.
- నెర్రలు బారుతున్న ఇళ్లు,
- భయం గుప్పిట్లో ప్రజలు. పట్టించుకోని అధికారులు.

**నేలకొండపల్లి మే 30 మీ వార్త ఆర్ సి:**

పాలేరు ప్రాంతం క్వారీల పేలుళ్లతో దద్దరిల్లుతోంది. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ప్రజలు క్షణం క్షణం భయం గుప్పిట్లో బతుకుతున్నారు. చెవులు చిల్లులు పడేలా వచ్చే పేలుడు శబ్దాలకు వృద్ధులు గుండెదడతో, పసిపిల్లలు భయంతో ఉలిక్కిపడుతున్నారు.

**129 నల్లరాయి క్వారీలు, 12 కంకర క్వారీలు:**
గనుల శాఖ ఏడీ ఇచ్చిన సమాచారం ప్రకారం నేలకొండపల్లిలో 49, కూసుమంచిలో 12, తిరుమలాయపాలెంలో 37, ఖమ్మం రూరల్‌లో 31 చొప్పున మొత్తం 129 నల్లరాయి క్వారీలు, 12 కంకర క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయితే ఈ క్వారీల్లో మోతాదుకు మించి పేలుడు పదార్థాలు వాడుతూ యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**10 కిలోమీటర్ల వరకు వినిపించే మోత:**
సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దం వస్తుంది. ఎక్కడి వారక్కడ బిగుసుకుపోతాం. ఇళ్లలో ఉయ్యాలలో నిద్రపోతున్న పసికందులు ఒక్కసారిగా ఏడుపు మొదలుపెడతారు" అని గ్రామస్తులు వాపోతున్నారు. క్వారీల్లో బాంబులు పేల్చినప్పుడు ఆ శబ్దం సుమారు 10 నుంచి 12



కిలోమీటర్ల వరకు వినిపిస్తోందని, మోతాదు మించిన శబ్ద తరంగాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలకు పాతర:**
రాళ్లను బయటికి తీయాలంటే పేలుడు పదార్థాలు వాడాల్సిందే. దీనికి ప్రత్యేక అనుమతి అవసరం. కానీ చాలా క్వారీల వద్ద సరైన పత్రాలు లేవని స్థానికులు చెబుతున్నారు. జెలటిన్ స్టిక్స్, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, గన్ పౌడర్‌ను వంద రెట్లు అధిక మోతాదులో వాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. బాంబుల దాటికి ఇళ్లు నెర్రలు బారుతున్నాయని, పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని, రాత్రిళ్లు భయంతో ఆరుబయటే నిద్రిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు.

**బోర్లు ఇంకిపోతున్నాయి, పంటలు నాశనం:**
బాంబుల శబ్దానికి బోర్లు ఇంకిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవి వస్తే నీరు దొరకని పరిస్థితి. దుమ్ము కొట్టుకుని, రాళ్లు పడి పంటలు నాశనం అవుతున్నాయి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**1952 చట్టం తుంగలో తొక్కారు..**



లీజు అయిపోయిన క్వారీలను పూడ్చాలని 1952 చట్టం చెబుతోంది. 2014 నుంచి ఇప్పటివరకు 14 లీజులు రద్దయి, వాటిలో గ్రానైట్ వేస్ట్ డంప్ చేయడానికి అనుమతించామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా పూడ్చిన దాఖలాలు లేవని ప్రజలు మండిపడుతున్నారు. వేస్ట్‌ను రోడ్ల వెంట పోయడంతో గుట్టలుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని విమర్శిస్తున్నారు.

**లెక్కలకు రెక్కలు:**
క్వారీల కోసం లీజుకు తీసుకున్నది కొంతైతే, ఆక్రమించుకుంది కొండంత. అధికారుల దగ్గర ఉన్న లెక్కలకు, యజమానులు తవ్వుకునే రాళ్లకు పొంతన ఉండదు" అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూకంపం వస్తే పాలేరు ప్రాంతం భూస్థాపితం అయ్యే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు 1952 చట్టాన్ని పూర్తిగా అమలు చేసి చర్యలు తీసుకోకపోతే గ్రామాలను వదిలి వెళ్లిపోతాం" అని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## డీఏవీ విద్యార్థిని ప్రతిభకు ప్రశంసల వెల్లువ.





**దమ్మపేట మే 30 మీ వార్త ఆర్ సీ వనమాల శ్రీనివాసరావు:** దమ్మపేటలోని డీఏవీ విద్యాసంస్థకు చెందిన విద్యార్థిని వనమాల యువతేశ్వరి తన అసాధారణ చిత్రలేఖన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటోంది. విద్యార్థిని రూపొందించిన కళాఖండాలను పరిశీలించిన కేటీపీఎస్ అవుట్ ఆఫ్ కంట్రీ జాంబియా బ్రాంచ్ జనరల్ మేనేజర్ రఘుబాబు ఆమె ప్రతిభకు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా యువతేశ్వరి చిత్రలేఖన నైపుణ్యాన్ని అభినందిస్తూ, కళారంగంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ఆకర్షణీయమైన చిత్రాలను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థినిలోని కళాత్మక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందని రఘుబాబు అన్నారు. ఈ సందర్భంగా యువతేశ్వరిని ప్రత్యేకంగా అభినందించి, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ యువతేశ్వరి సాధిస్తున్న విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కళారంగంలో ఆమె మరింత రాణించాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల విక్రయాలు జరగాలి.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు ఏడిఏ కరుణశ్రీ.

**కారేపల్లి మే 30 మీ వార్త ప్రతినిధి:**



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని డివిజన్ వ్యవసాయ అధికారి తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. సింగరేణిమండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అప్పాయిగూడెం రైతు వేదికనందు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువు, విత్తనం, పురుగుమందుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే విక్రయించి రైతులకు సహకరించాలని కోరారు.వ్యవసాయ శాఖ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. పేరుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో దున్నుకోవాలని, రైతులందరూ విధిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏవో) భట్టు అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) మున్నీ, సింగరేణి మండల ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసి యువ నాయకుడికి అరుదైన గౌరవం --
# తెల్లం హరికృష్ణను సన్మానించిన సీపీఎల్ కమిటీ సి పి ల్ సత్కారం.

**చర్ల మే 30 మీ వార్త ప్రతినిధి:** చిన్న మిడిసిలేరు గ్రామంలో చిన్న మిడిసిలేరు ప్రీమియర్ లీగ్ ( సి పి ల్ ) వారి ఆధ్వర్యంలో దుమ్ము గూడెం మండలానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించబడ శ్రీ తెల్లం హరికృష్ణ ని సి పి ల్ కమిటీ మరియు గ్రామ యువత సన్మానించడం జరిగింది. తెల్లం హరికృష్ణ చిన్నతనం నుండి కాంగ్రెస్ పార్టీ అభిమానిగా, నిబద్ధత గల కార్యకర్తగా ఉంటూ, పార్టీ కష్టకాలంలో కూడ పార్టీని నమ్ముకుని ఉన్నారని, ఆయనకు పదవి ఉన్న లేకపోయిన తనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో సేవ చేస్తూ ఉన్నారని. యువతకు కూడ అన్ని విషయాలలో అనగా క్రీడ, సామాజిక సేవ, రాజకీయలు వంటి అంశాలలో ముందు ఉంటూ ప్రోత్సాహిస్తూ ఉంటారని ఈ పదవి కూడ వారికి ఉరికనే రాలేదని ఏంతో మంది పోటీ ఉన్నప్పటికీ, ఒక ఆదివాసికి అందున ఒక యువకుడికి జాతీయ పార్టీ మండల అధ్యక్షుడిగా



నియమించబడ అంటే అంతా ఆషామాషీ వ్యవహారం కాదని కావున ఆయన రాజకీయాలలో మరింత ఎదిగి అనేక పదవులు చేపట్టలని, యువతకు ఆదర్శం కావాలని కొనియాడారు.
తర్వాత సన్మానగ్రహీత తెల్లం హరికృష్ణ మాట్లాడుతూ ఇంత లోపల గ్రామాలలో కూడ సి పి ల్ కమిటీ వారు ఇంత ఎండలను సైతం లేకచేయక, ఆటగాళ్లకు నీరు, డ్రింక్స్ వంటివి అందిస్తూ వారు గ్రామీణ స్థాయిలో ఆటగాళ్లను ప్రోత్సహించడానికి క్రికెట్ టోర్నమెంట్ ను క్రమతప్పకుండా నిర్వహిస్తూ అలా ఇది 6వ సీజన్ అని చెప్పారు. అలాగే యువత కూడ రాజకీయలలో చురుకుగా ఉండాలని , ఒక వ్యక్తి పార్టీని నమ్ముకుని ఉంటే ఎంత వరకు చేర వచ్చో అనే విషయాన్నికి తానొక ఉదాహరణ అని, పంచాయతీ వార్డు మెంబర్, సర్పంచ్, ఎం పి టీ సి వంటి పదవులలో ఆదివాసి నాయకులు స్వయం నిర్ణయాక శక్తిగా ఎదిగి రాజకీయలలో రాణించాలని కోరారు. తాను ఎక్కడ , ఏ పదవిలో ఉన్నా తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని తెలిపారు. ఈయొక్క కార్యక్రమంలో సి పి ల్ కమిటీ నిర్వాహకులు లక్ష్మణ్, దుర్గ రావు, మనోజ్, ఆది, రాంబాబు, నాగరాజు, ప్రేమ్, సందీప్, అన్వేష్, విష్ణు, అనిల్, సాగర్, మహేష్, ప్రవీణ్, వినోద్, రాజు, ప్రసాద్, చిన్న మిడిసిలేరు మాజీ సర్పంచ్ మురళి , గ్రామ యువత రాజేష్ అంజి, వీరభద్రం, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్న వితరణ కార్యక్రమం.

**కొత్తగూడెం మే 30 మీ వార్త ఆర్ సి:**



మానవసేవయే మాధవసేవ ప్రతి మనిషికి ఈ దృక్పథం తోటి ఆలోచించి తనకున్న దానిలో ఎంతోకొంత నిరుపేదలకు సహాయం ఏదో రకంగా సేవలందించాలని ఆలోచనతో నిత్యం లయన్స్ క్లబ్ కొత్తగూడెం పనిచేస్తూనే ఉంటుంది అందులో భాగంగానే డిస్టిక్ 320 ఈ గవర్నర్ మదనమోహన్ రేపాల విజయలక్ష్మి గార్ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని జ్యోతి వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు ఈరోజు సాయం సంధ్య వేళలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహిస్తూ వృద్ధులను ఆప్యాయంగా పలకరించడమైనది, వారికి ఎప్పుడూ ఏ కష్టం వచ్చినా లయన్స్ క్లబ్ ఆఫ్ విలియం కొత్తగూడెం అండగా ఉంటుందని తెలియపరచడం జరిగినది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్ క్లబ్ నెంబర్స్ లయన్ బొక్క శ్రీనివాస్ ప్రెసిడెంట్ లయన్, పగడాల నాగేష్ ట్రెజరర్ లయన్, పితాని సత్యనారాయణ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ సీనియర్ నెంబర్ లయన్,, జె బి మోహన్ డిసి లయన్ మండల రాజేశ్వరరావు డిసి.

## ప్రభుత్వ చేతి పంపుకు అక్రమంగా అమర్చిన మోటర్ తొలగింపు --
## గ్రామ ప్రజలకు న్యాయం చేసిన ఉప్పరిగూడెం సర్పంచ్.

**చర్ల మే 29 మీ వార్త ప్రతినిధి: ౧**

ఉప్పరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన కొర్సా శివ అనే వ్యక్తి ప్రభుత్వ చేతి పంపుకు అక్రమంగా మోటర్ అమర్చి, తన ఇంటి నిర్మాణ పనుల కోసం నీటిని స్వంతంగా వినియోగిస్తున్నట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడైంది. ఈ విషయంపై గతంలో పంచాయతీ సిబ్బంది పలుమార్లు మోటర్‌ను తొలగించాలని సూచించినప్పటికీ, కొర్సా శివ వారి సూచనలను పట్టించుకోలేదు. అనంతరం ఉప్పరిగూడెం సర్పంచ్ నాగలక్ష్మి గారు కూడా మోటర్‌ను తొలగించాలని అధికారిక నోటీసు జారీ చేసినా, అతను స్పందించలేదు. ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు పంచాయతీ తరఫున ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా నిర్వహించారు. అయినప్పటికీ సమస్య కొనసాగుతుండటంతో, మే 29న సర్పంచ్ నాగలక్ష్మి గారు పంచాయతీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి, ప్రభుత్వ చేతి పంపుకు అక్రమంగా అమర్చిన మోటర్‌ను తొలగించారు. దీంతో అక్కడి ప్రజలకు న్యాయం జరిగిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.





ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోయం మంగతాయాలు, వార్డు సభ్యురాలు పాయల ప్రమీల, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. ప్రజల తాగునీటి హక్కును కాపాడేందుకు పంచాయతీ చర్య గ్రామస్థుల హర్షం.

## నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు

పంట అవశేషాలు కాలిస్తే భూములకు నష్టం: ఏడిఏ కరుణశ్రీ.




**కారేపల్లి మే 30 మీ వార్త ప్రతినిధి:**

ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో విత్తనాలు అమ్మేవారు వస్తే రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దని ఏ డి ఏ కరుణ శ్రీ అన్నారు. మండల పరిధిలోని రావోజి తండా గ్రామపంచాయతీలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ పంట అవశేషాలు కాలిస్తే మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోయి పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి అన్నారు. పంట అవశేషాలు చేలలోని నిర్వీర్యం చేయగలిగితే భూసారం పెరుగుతుందన్నారు. ఎవరైనా పంట అవశేషాలను కాల్చినట్టు తెలిస్తే జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్లో కేసులు నమోదవుతాయన్నారు. ఇటీవల కాలంలో కొందరు నకిలీ విత్తనాలను గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తుందని అలాంటి వాటిని రైతులు తీసుకోవద్దని అధికృత డీలర్ నుండి బ్రాండెడ్ కంపెనీలకు విత్తనాలను కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ ఏ ఈ ఓ మున్ని సర్పంచ్ భూక్య బాలు, వార్డ్ మెంబర్ రామ్మూర్తి, గ్రామ పెద్దలు నాగేశ్వరరావు, కన్నయ్య, వై పొట్టయ్య బుచ్చయ్య, గ్రామస్తులు చంద్రకళ, గురవమ్మ వీరమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండే ఎండలకు అల్లాడుతున్న మూగజీవాలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం.

- భూగర్భ జలాలు అడుగంటి నీళ్ల కోసం అగచాట్లు.. గతంలో నిర్మించిన నీటి తొట్లు ఏమయ్యాయో?

**నేలకొండపల్లి మే 30 నీ వార్త ఆర్ సి:**



రాష్ట్ర వ్యాప్తంగా భానుడు నిప్పులు కురిపిస్తున్న నేపథ్యంలో మూగజీవాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం, వాగులు-వంకలు, ఏర్లు, రిజర్వాయర్లు ఎండిపోవడంతో పశువులు, పక్షులు, వన్యప్రాణులు దాహార్తితో విలవిల్లాడుతున్నాయి. నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతూ అక్కడక్కడే మృత్యువాత పడుతున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి. నీటి దాహానికి తాళలేక ప్రమాదకరమైన వన్యప్రాణులు సైతం గ్రామాల్లోకి వస్తున్నాయి. దీనివల్ల పలు జిల్లాలలో మనుషులకు ప్రాణహాని జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నీటి ఎద్దడి ఇలాగే కొనసాగితే అరుదుగా కనిపించే పిచ్చుకలు, గద్దలు, కాకులు, కొంగలు లాంటివి భవిష్యత్ తరాలకు పుస్తకాల్లోనే మిగిలిపోతాయని, ప్రత్యక్షంగా చూడలేమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను చూసి భయపడే జంతువులు సైతం దాహంతో గ్రామాలపై పంజా విసురుతూ నీటిని తాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మేలుకొని పొలాల్లో, అడవుల్లో, గ్రామాల్లో నీటి తొట్లను యుద్ధప్రాతిపదికన నిర్మించి, నీటి సౌకర్యం కల్పించి మూగజీవాలను కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము.

- ఖమ్మం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మైలవరపు మణికంత.

**ఖమ్మం మే 30 మీ వార్త ప్రతినిధి:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ని హైదరాబాదు కేంద్రంగా కొంతమంది చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము ఖమ్మం జనసేన పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నము.తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు ఏ ఆపద వచ్చినా నేను ఉన్నాను అని ముందుకు వచ్చి కోట్లాది రూపాయల తన కష్టార్జితాన్ని విరాళంగా ఇస్తూ పేదల అభ్యున్నతికి ఎన్నోసార్లు కృషి చేసిన పవన్ కళ్యాణ్ పై అర్ధరూపాయి కూడా విలువ చేయని కొన్ని దృష్ట శక్తులు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడడాన్ని జనసేన పార్టీ మూకమ్మడిగా వ్యతిరేకిస్తున్నాము. ప్రజాస్వామ్య దేశంలో పాలసీలపై విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలు, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్థానం లేదని పునరుద్ఘాటిస్తున్నాను. ఆర్టికల్ 19 (1) (ఖ) వాక్ స్వాతంత్ర్యం ఇస్తుంది, కానీ ఆర్టికల్ 19(2) బాధ్యతలేని, అవమానకర వ్యాఖ్యలకు రక్షణ ఇవ్వదు.కొండగట్టు అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడంలో పాత్ర గుర్తుంచుకోవాలి. ఆదిలాబాద్ తాండాల్లో నీటి సమస్యల కోసం ఆయన వ్యక్తిగతంగా సహాయం చేసిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్ వరదల సమయంలో ఆర్థిక సహాయం చేశారని సరూర్‌నగర్ ఘటనలో బాధిత కుటుంబానికి అండగా నిలబడి న్యాయం కోసం గొంతెత్తారు.నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని గౌరవించే వ్యక్తి పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆంధ్ర ప్రజలు అన్నదమ్ముల లాగా పరస్పర గౌరవం, సోదరభావంతో ముందుకు సాగాలి అని, తద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తామని తెలియ పరుస్తూ ఇలాంటి వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేస్తున్నాము.

## పొగాకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- పొగాకు వ్యతిరేక దినోత్సవం లో డాక్టర్ హారిక పిలుపు.





**కామేపల్లి మే 30 మీ వార్త ప్రతినిధి:** పొగాకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కే.హారిక పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన కామేపల్లి లో శనివారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిం చారు.ఆరోగ్యానికి హానిని కలిగించే పొగాకు వ్యతిరేకంగా నినాదాలు, ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. అనంతరం డాక్టర్ హారిక మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం వలన క్యాన్సర్ సంబంధిత వ్యాధులు రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కే.వెంకటేశ్వర్లు, పిహెచ్ఎన్ స్వర్ణమార్త, సూపర్వైజర్లు రాధాకృష్ణ,లక్ష్మి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత పొగాకు తీసుకోవడం వలన కలిగే అనర్ధాలను వివరించారు. అవగాహన కల్పించి చైతన్య పరిచారు.

# అవయవ రక్షణ శస్త్రచికిత్సల్లో టిఆర్ ఆర్ హాస్పిటల్‌కు విశేష విజయాలు.

- ఇలిజారోవ్ పద్ధతితో 13 సెం.మీ. ఎముక పునర్నిర్మాణం కాలు తొలగించే పరిస్థితి నుంచి రోగికి కొత్త జీవితం.

**ఖమ్మం మే 30 మీ వార్త ప్రతినిధి:**

క్లిష్టమైన ఎముక గాయాలు, ఇన్‌ఫెక్షన్లు మరియు ప్రమాదాల్లో అవయవ రక్షణ చికిత్సల్లో ఖమ్మంలోని టిఆర్ ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ హాస్పిటల్ వైద్య బృందం విశేష ఫలితాలు సాధించినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం ఏడాదిన్నర కాలంలోనే అనేక అరుదైన, క్లిష్టమైన ఆర్థోపెడిక్ కేసులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. వైద్యుల వివరాల ప్రకారం, తీవ్రమైన క్రష్ ఇంజరీలతో ఎముకలు, మృదు కణజాలం దెబ్బతిన్న పలువురు రోగులకు ఇలిజారోవ్ టెక్నిక్ ద్వారా అవయవ రక్షణ చికిత్స అందించారు. ఈ పద్ధతిలో ఎముక పెంపు మరియు ఎముక పునర్నిర్మాణం చేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు.శ్రీలత అనే మహిళకు జరిగిన తీవ్రమైన క్రష్ ఇంజరీ తర్వాత ఇలిజారోవ్ పద్ధతితో 12.2 సెంటీమీటర్ల ఎముక పెంపు చేసి అవయవాన్ని కాపాడినట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్‌ఫెక్టెడ్ నాన్-యూనియన్ టిబియా సమస్యతో బాధపడుతున్న ఉదయ్‌కు 6 సెంటీమీటర్ల లింబ్ లెంగ్తెనింగ్ సురేష్‌కు 8 సెంటీమీటర్ల ఎముక పెంపు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన కేసుగా లారీ డ్రైవర్ సోమేశ్వరరావు చికిత్సను వైద్యులు వివరించారు. రెండు కాళ్లలో తీవ్రమైన క్రష్ ఇంజరీలు, విస్తృతమైన సాఫ్ట్ టిష్యూ నష్టం కారణంగా కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ, ఇలిజారోవ్ పద్ధతి, స్కిన్ గ్రాఫ్టింగ్ మరియు దీర్ఘకాలిక పునరావాస చికిత్సల ద్వారా 13 సెంటీమీటర్ల ఎముక పునర్నిర్మాణం చేసి అవయవాలను కాపాడగలిగినట్లు తెలిపారు. సుమారు 13 నెలల చికిత్స అనంతరం రోగి తిరిగి నడిచే స్థితికి చేరుకున్నట్లు చెప్పారు. అదే విధంగా, తీవ్రమైన వాల్గస్ డిఫార్మిటీ, ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న ప్రమీలకు టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స నిర్వహించి సాధారణ జీవితం అందించినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, దాడుల కారణంగా



బహుళ ఫ్రాక్చర్లు, తలకు గాయాలతో చేరిన పలువురు రోగులకు దశలవారీ శస్త్రచికిత్సలు నిర్వహించి పూర్తిగా కోలుకునేలా చేసినట్లు తెలిపారు. ఈ విజయాలు వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు మరియు ఇతర సిబ్బంది సమిష్టి కృషి ఫలితమని డాక్టర్ లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక వైద్య సాంకేతికతతో ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# ఖమ్మంలో ప్రారంభమైన భారతదేశపు అతిపెద్ద ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ స్టోర్.

- లాడియా ఏడో షోరూమ్.

**ఖమ్మం మే 30 మీ వార్త ప్రతినిధి:** ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్న లాడియా సంస్థ ఖమ్మంలో తన ఏడో స్టోర్‌ను ఘనంగా ప్రారంభించింది. డైమండ్స్ అందరికీ అనే లక్ష్యంతో, వినూత్నత, విశ్వసనీయత మరియు కస్టమర్-ఫస్ట్ విధానంతో ముందుకు సాగుతున్న లాడియా ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ప్రపంచాన్ని కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఖమ్మంలోని ఈ నూతన స్టోర్‌ను ప్రముఖ నటి నేహా శెట్టి అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరి మాట్లాడుతూ, ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో భారత్ విశేష పురోగతి సాధించింది. ఈ రంగంలో మరిన్ని వినూత్న ఆలోచనలను అందిస్తూ ఆ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి లాడియా కట్టుబడి ఉంది. తెలంగాణలోని ప్రముఖ జ్యువెలరీ కేంద్రం ఖమ్మంలో మా ఏడో స్టోర్‌ను ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది” అని తెలిపారు.ల్యాబ్-గ్రోన్ డైమండ్లు పేరుకు తగ్గట్టుగానే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ప్రయోగశాలల్లో తయారు చేస్తారు. ఇవి సహజ వజ్రాల మాదిరిగానే రిఫ్రాక్టివ్



ఇండెక్స్, ఆప్టికల్ లక్షణాలను కలిగి ఉంటాయి. సహజ వజ్రాలకు ఉపయోగించే అదే కలర్, క్లారిటీ ప్రమాణాలతో వీటిని కూడా గ్రేడ్ చేస్తారు. లాడియాలో బంగారు ఆభరణాలతో రూపొందించిన డైమండ్స్ మరియు సాలిటైర్స్ విస్తృత శ్రేణిలో అందుబాటులో ఉన్నాయి. హారాలు, వడ్డాణాలు, నెక్లెస్‌లు, గాజులు, పెండెంట్లు, బ్రేస్‌లెట్లు, చెవిపోగులు, జుంకాలు, ఉంగరాలు మరియు ప్రత్యేక ల్యాబ్-గ్రోన్ పోల్కీలు వినియోగదారులకు లభ్యమవుతాయి. అలాగే లాడియా ప్రత్యేక కస్టమైజేషన్ సదుపాయాన్ని అందిస్తోంది. వినియోగదారులు తమకు నచ్చిన డిజైన్‌ను స్వయంగా రూపొందించుకోవచ్చు. ఆభరణం రూపకల్పన ప్రక్రియలో ప్రతి దశలో భాగస్వామ్యం కావచ్చు. అంతేకాకుండా, డైమండ్ గ్రేడింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నుంచి ధృవీకరణ పత్రాలు కూడా



అందిస్తారు.లాడియా సంస్థ 24 క్యారెట్ల పాత బంగారంపై ఫుల్ వాల్యూ గోల్డ్ ఎక్స్చేంజ్ సదుపాయాన్ని కూడా కల్పిస్తోంది. పాత బంగారాన్ని ఇచ్చి నూతన డిజైన్ల జ్యువెలరీని పొందవచ్చు. డైమండ్ ధరలు ప్రతి క్యారెట్‌కు రూ.24,999 నుంచి ప్రారంభమవుతాయి. విభిన్నమైన ప్రత్యేక కలెక్షన్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. ప్రారంభోత్సవం సందర్భంగా లాడియా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 2026 మే 30 నుంచి జూన్ 14 వరకు సాలిటైర్ డైమండ్స్‌పై ఫ్లాట్ 25% డిస్కౌంట్ డైమండ్స్ మరియు మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 15% డిస్కౌంట్ జీరో వేస్టేజ్ ఆఫర్ ఈ ప్రత్యేక ఆఫర్లతో ఖమ్మం ప్రజలకు అత్యుత్తమ ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీని మరింత అందుబాటు ధరల్లో అందించనున్నట్లు లాడియా సంస్థ వెల్లడించింది.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల విక్రయాలు జరగాలి.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు ఏడిఏ కరుణశ్రీ.



**కారేపల్లి మే 30 మీ వార్త ప్రతినిధి:** ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని డివిజన్ వ్యవసాయ అధికారి తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. సింగరేణిమండలంలోని ఎరువులు, విత్తనాలు,పురుగుమందుల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అప్పాయిగూడెం రైతు వేదికనందు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువు, విత్తనం, పురుగుమందుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే విక్రయించి రైతులకు సహకరించాలని కోరారు.వ్యవసాయ శాఖ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. పేరుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో దున్నుకోవాలని, రైతులందరూ విధిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏవో) భట్టు అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) మున్నీ, సింగరేణి మండల ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు, రైతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కామేపల్లి లో 12వ రోజుకు చేరిన గ్రామ దీపికల నిరవధిక సమ్మె.

- సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని తెలిపిన బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ పార్టీల నాయకులు.
- ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తాం.
- గ్రామ దీపికల యూనియన్ స్పష్టీకరణ.



**కామేపల్లి మే 31 మీ వార్త ప్రతినిధి:** గ్రామ దీపికల కామేపల్లి మండల యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోరుతూ వివోఏ లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 12వ,రోజుకు చేరింది.శని వారం గ్రామ దీపికలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ పార్టీల నాయకులు సందర్శించి సమ్మెకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు.బిఆర్ఎస్ జిల్లా నాయకులు అంతోటి అచ్చయ్య, సిపిఐ రాష్ట్ర నాయకురాలు ఏపూరి లతా దేవి,మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు,ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ,సిపిఎం సీనియర్ నాయకులు వింజం నాగభూషణం,సీఐటీయూ మండల కార్యదర్శి బాదావత్ శ్రీను,బిఆర్ఎస్ జిల్లా నాయకులు మూడు కృష్ణ ప్రసాద్ నాయక్ అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు అనేక హామీలు ఇచ్చారని అట్టి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వివోఏ లకు కనీస వేత నం 26వేల రూపాయలు ఇవ్వాలని, సీసీలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. సెల్ ఫోన్లు అందించాలని,ప్రభుత్వ ఉద్యో గాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో వారు చేస్తున్న పోరాటానికి తాము రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కన్నమాల రాంబాబు, సిపిఐ మండల నాయకులు పుచ్చకాయల వెంకటకృష్ణ, వంకాయలపాటి ప్రసాద్,గ్రామ దీపికల సంఘం మండల అధ్యక్షురాలు వి. సుజాత,మండల ఉపాధ్యక్షులు మాలోత్ గోపి, ప్రతినిధులు వీరారెడ్డి, గడ్డం పద్మ,సబితా, నాగమణి, ధనమ్మ, నిర్మల, విజయలక్ష్మి, రవి, రమేష్, భరత్, రామ్ జీ, డి.రమేష్, దైద పద్మ, జయమ్మ, మంగీలాల్, బొందల నాగమణి, గోకర ముత్తమ్మ, మంగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రాజకీయాల్లో 'రేగా ' సెగ...

- చాపకింద నీరులా గులాబీ దళపతి వ్యూహాలు...
- రేగా లేని లోటు తెలుస్తుందన్న నియోజకవర్గ ప్రజలు.

**పినపాక నియోజకవర్గ మీ వార్త ప్రతినిధి మే 30:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు, ఓటమి తర్వాత రాజకీయ నాయకులు రెండు రకాలుగా ప్రవర్తిస్తుంటారు. కొందరు పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయి సైలెంట్ అయిపోతే.. మరికొందరు మాత్రం జనం మధ్యకే వెళ్లి తమ బలాన్ని తిరిగి కూడగట్టుకుంటారు. పినపాక మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ రేగ కాంతారావు కచ్చితంగా ఈ రెండో కోవకే చెందుతారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీఆర్ఎస్ ( బిఆర్ఎస్) పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ఆయన వేస్తున్న అడుగులు ఇప్పుడు అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఇది కేవలం పైకి కనిపించే హడావుడి కాదు.. క్షేత్రస్థాయిలో ఆయన పక్కాగా అమలు చేస్తున్న 'సైలెంట్ ఆపరేషన్'.

**అదే ప్రధాన అస్త్రం.. అక్కడే అసలు గురి..!**

రాజకీయాల్లో ప్రత్యర్థి బలహీనతే మన బలం. సరిగ్గా ఈ సూత్రాన్నే రేగ కాంతారావు బలంగా నమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన 'ఆరు గ్యారెంటీల' అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఆయన తనకు అనుకూలంగా మలచుకుంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకు పరిమితం కాకుండా.. ఏ గూడెంలో, ఏ తండాలో అయితే ప్రజలు హామీల కోసం ఎదురుచూస్తున్నారో. నేరుగా అక్కడికే వెళ్తున్నారు. "గ్యారెంటీల పేరుతో మోసపోయాం.. మన గొంతుక వినిపించాలంటే గులాబీ జెండానే శ్రీరామరక్ష" అంటూ సామాన్యుడి భాషలో వివరిస్తూ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**పాలిటిక్స్ అంటే స్పీచులు కాదు.. చేతలు..!!**

ఒకప్పుడు ప్రభుత్వ విప్ హోదాలో ఉన్న నాయకుడు.. ఇప్పుడు సామాన్యుడిలా రోడ్డు మీద ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం సామాన్యమైన విషయం కాదు. తన కళ్లెదుట రోడ్డు ప్రమాదం జరిగితే, కాన్వాయ్ ఆపి మరీ బాధితులకు స్వయంగా ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి పంపించడం ఆయనలోని మానవత్వాన్ని, ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పుట్టి పెరిగిన గిరిజన బిడ్డ కావడంతో. అక్కడి ప్రజల నాడి ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. కష్టంలో ఉన్నప్పుడు "నేనున్నాను" అని భరోసా ఇచ్చే నాయకుడికే జనం బ్రహ్మరథం పడతారు. సరిగ్గా ఇదే పాయింట్ రేగను ప్రజలకు మరింత దగ్గర చేస్తోంది.

**పల్లె పట్టు.. 'పరిషత్' టార్గెట్ గా రేగా మార్క్ వ్యూహం..!**

పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఘట్టం ముగియడంతో..రేగా కాంతారావు తన రాజకీయ చతురతనంతా రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ (పరిషత్) ఎన్నికలపైనే కేంద్రీకరించారు. అధికార మార్పిడితో పైస్థాయిలో కొందరు నాయకులు గోడ దూకినా ఆయన ఏమాత్రం బెదరడం లేదు; గ్రామ స్థాయిలో పార్టీకి పట్టుకొమ్మలైన అసలైన క్యాడర్‌ను మాత్రం ఎవరూ టచ్ చేయకుండా చెక్కుచెదరకుండా కాపాడుకుంటున్నారు. భద్రాద్రి రాజకీయాల్లో అత్యంత కీలకమైన యువత, గిరిజన ఓటు బ్యాంకును మళ్లీ గులాబీ వైపు తిప్పేందుకు ఆయన పక్కా స్కెచ్ వేశారు. ఒకవైపు తన ఆపద్బాంధవ సేవా కార్యక్రమాలతో యువతలో స్ఫూర్తి నింపుతూనే.. మరోవైపు పార్టీలోని గ్రూపు తగాదాలకు చెక్ పెడుతూ, పల్లెల్లోని స్థానిక నేతలందరినీ ఒకే తాటిపైకి తెస్తున్న రేగ కాంతారావు ఎత్తుగడలు ఇప్పుడు ఆయన రాజకీయ పరిణతికి అద్దం పడుతున్నాయి. గిరిజన ప్రాంతాలపై రేగా కాంతారావుకు ఉన్న పట్టు, ఆయన రాజకీయ చతురత గురించి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గ్రూపు తగాదాలను పక్కనపెట్టి, బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త రక్తం ఉరకలెత్తేలా ఆయన చేస్తున్న పల్లెబాట.. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీకి ఖచ్చితమైన మైలేజ్ ఇస్తుందనడంలో సందేహం లేదు. ఏది ఏమైనా, తనదైన మార్క్ పాలిటిక్స్‌తో అటు పినపాకలో, ఇటు భద్రాద్రి జిల్లాలో కాంగ్రెస్‌కు నిద్రలేకుండా చేయడంలో రేగ వ్యూహం సక్సెస్ అయిందనే చెప్పాలి.

# గోదావరిలో ఇసుక మాఫియా



గోదావరిలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. ధర్మపురి మండలం చివరి గ్రామం ఆరెపల్లి కేంద్రంగా బరితెగిస్తున్నది. పగలూ రాత్రి అనే తేడా లేకుండా, డోజర్లను పెట్టి ఇష్టారాజ్యంగా తోడుతున్నది. నీటి పాయలను కూడా మలుపుతూ.. 20 మీటర్ల మేర లోతులో తవ్వుతున్నది. ఆపై నిత్యం వందలాది ట్రాక్టర్లలో తీసుకెళ్లి గ్రామంలో డంప్ చేస్తూ.. టిప్పర్లలో బయటికి తరలిస్తూ నెలకు రూ.3కోట్లకు పైనే దందా చేస్తున్నది. సహజ వనరులను దోపిడీ చేస్తూ.. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నా యంత్రాంగం చోద్యం చూడడంపై జలవనరుల శాఖ నిపుణులు, ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా మేలుకొని సహజవనరులను కాపాడాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

గోదావరి తీరం ఆనుకొని ఉన్న ధర్మపురి మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. నది ఒడ్డున ఉన్న ఆరెపల్లి గ్రామం అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఈ గ్రామ ఒడ్డు నుంచి అవతలి ఒడ్డు దాకా దాదాపు రెండుకిలోమీటర్లకు పైనే నది వెడల్పు ఉంటుంది. ఇదే అక్రమార్కులకు వరంలా మారింది. మండలంలో ఈ గ్రామం చివరగా ఉండడంతో ఎంతతోడుకుంటే అంతఅన్నట్టు హద్దు లేకుండా పోయింది. ప్రస్తుతం వేసవి కావడంతో ప్రవాహం తగ్గడం, నది ఒకటి, రెండు పాయలుగా మాత్రమే ప్రవహిస్తుండడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్లు, డోజర్లను అవలీలగా నదిలోకి దించి, పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను ఎడాపెడా తోడేస్తున్నారు. అవసరమైతే పాయలుగా ప్రవహించే నదీ ప్రవాహ దిశను మార్చి తవ్వుతున్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో ట్రాక్లర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఎవరైనా అడిగితే ఎంతటి దౌర్జన్యానికి కూడా వెనుకాడని పరిస్థితి ఉంది. మాఫియాపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాల వల్ల ఆరెపల్లి గ్రామమే కాకుండా దొంతాపూర్, తీగలధర్మారం, తదితర గ్రామ రహదారులు దెబ్బతింటుండగా, దుమ్ము కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్ల హడావిడితో రాత్రుళ్లు నిద్రలు పట్టడం లేదని వాపోతున్నారు.

**నెలకు రూ.3కోట్ల పైనే వ్యాపారం?**

ఆరెపల్లిలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణా చిన్నస్థాయి దందా కాదు. నెలకు కోట్ల రూపాయల దందా సాగుతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డోజర్లను నదిలో నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్లలో నింపి, దంపులుగా పోగు చేసి అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలించే వ్యవహారం రోజుకు వందల ట్రిప్పులతో సాగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో ఇంటికో ట్రాక్టర్ అన్నట్టు ఉండడం చూస్తే అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమైపోతుంది. గ్రామంలో తక్కువలో తక్కువ 150 ట్రాక్టర్లు ఉన్నాయి. ఒక్కో ట్రాక్టర్ కనీసం 5ట్రిప్పుల ఇసుకను గోదావరి నుంచి ఒడ్డుకు చేరుస్తుంటుంది. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు ధర రూ.1500 వరకు చార్జ్ చేస్తారు. అంటే ఒక్కో ట్రాక్టర్ రోజుకు కనీసం 5 ట్రిప్పుల ఇసుకను తోడినా సంపాదన రూ.7500 అవుతుంది. ప్రస్తుతం రోజుకు 150 ట్రాక్టర్లు నడుస్తుండగా, రూ.11లక్షల 25వేల విలువైన ఇసుక తరలిపోతున్నది. అంటే నెలకు రూ.3కోట్లకు పైనే దందా సాగుతున్నట్టు తెలుస్తున్నది.

**శాఖలు ఎన్నో.. చర్యలు శూన్యం?**

గోదావరి నదిలో కనిపించే ఇసుక ఒక్కరోజులో ఏర్పడేది కాదు. ఇది వేల సంవత్సరాల ప్రకృతి ఫలం. అవసరానికి మించి తవ్వితే భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు నదీ ప్రవాహ దిశమారుతుంది. వరదల ప్రమాదం పెరుగుతుంది. వంతెనల పునాదులు బలహీనపడే ప్రమాదముంటుంది. నదీ జీవవ్యవస్థ కూడా దెబ్బతింటుందని జలవనరుల శాఖ నిపుణులు, భూగర్భ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇసుక అక్రమరవాణా అనేది కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదు. అది ప్రకృతి సంపదపై జరుగుతున్న దోపిడీ. దానిని అడ్డుకోవడంలో గనులు, భూగర్భశాఖ పాత్ర అత్యంత కీలకం. ఈ శాఖతో పాటు పోలీస్ శాఖ, రెవెన్యూ, రవాణా శాఖ, నదుల భద్రతకోసం ఇరిగేషన్ శాఖ, మొత్తం వ్యవహారాన్ని సమన్వయం చేయడానికి జిల్లా యంత్రాంగం ఉంది. ఇన్ని శాఖలు, ఇంతటి వ్యవస్థ ఉన్నా అక్రమ రవాణా మాత్రం ఆగకపోవడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిజంగా చిత్తశుద్ధితో ముందుకు వస్తే అక్రమ రవాణాకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు.

**అత్యంత ప్రమాదకరంగా తవ్వకాలు**

ఇసుక రవాణాకు అధికారులు అనుమతి ఇచ్చినా.. నిబంధనల ప్రకారం కేవలం రెండు క్యూబిక్‌మీటర్లలోతు వరకే తోడాల్సి ఉంటుంది. కానీ, ఆరెపల్లిలో అడ్డూఅదుపు లేకుండా దాదాపు 20 మీటర్ల లోతువరకు తోడేస్తున్నారు. ఇది సాధారణ తవ్వకం కాదని, అత్యంత ప్రమాదకరమని, నది సహజ నిర్మాణాన్నే దెబ్బతీసే చర్యగా అధికారులు చెబుతున్నారు. దీని వల్ల భగర్భ జలాలు పడిపోవడంతో పాటు వరదల సమయంలో నీటివేగం పెరిగి సమీప గ్రామాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# నేరుగా ఆర్థిక శాఖ బృందాలే వచ్చేస్తున్నాయ్

## విధానాల రూపకల్పనకు క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ

## దేశవ్యాప్తంగా పరిశ్రమల సందర్శనకు ఆర్థిక శాఖ కసరత్తు

**న్యూఢిల్లీ:** ఆర్థిక విధానాలు .. బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనకు, పశ్చిమాసియా సంక్షోభంపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోతగిన చర్యల గురించి క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, పరిశ్రమ క్లస్టర్లను సందర్శించడంపై కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక వ్యవహారాల విభాగం కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఆర్థిక శాఖలోని అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి లేదా డైరెక్టర్ సారథ్యంలో అయిదుగురు వరకు సభ్యులతో బృందాలను ఏర్పాటు చేస్తారు. ఈ బృందాలు భారీ, మధ్య, చిన్న తరహా తయారీ యూనిట్లను సందర్శిస్తాయి. వివిధ రంగాల వ్యాప్తంగా విధానాలు, నిర్వహణపరమైన సవాళ్లను పరిశీలిస్తాయి. మౌలిక సదుపాయాలు, రెగ్యులేటరీ అవరోధాలు, సరఫరా వ్యవస్థలో అవాంతరాలు, నిధుల లభ్యతపరమైన సవాళ్లు, నైపుణ్యాల్లో కొరత, సాంకేతికత వినియోగం మొదలైన అంశాలు వ్యాపారాలపై చూపుతున్న ప్రభావాల గురించి నేరుగా తెలుసుకుంటాయి. ఒక్కో విడతలో కనీసం రెండు స్టార్టప్‌లతో పాటు తయారీ, ఇన్‌ఫ్రా, పరిశోధనలు తదితర రంగాల సంస్థలను సందర్శించి, పరిస్థితుల గురించి బృంద సభ్యులు తెలుసుకుంటారు. కొన్ని రంగాలపై ప్రభుత్వం గణనీయంగా వ్యయం చేస్తున్నప్పటికీ, వివిధ కారణాలరీత్యా ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా పుంజుకోవడం లేదు. పశి?చమాసియా సంక్షోభం వల్ల రూపాయి బలహీనపడటం, క్రూడాయిల్ రేట్లు పెరగడం తదితర సవాళ్లు వీటికి తోడయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ కసరత్తు ప్రాధాన్యం సంతరించుకుంది.



## కామేపల్లి గ్రంథ పాలకురాలు లలిత కుమారి కి పదోన్నతి.



**కామేపల్లి మే 30 మీ వార్త ప్రతినిధి:** కామేపల్లి శాఖా గ్రంథాలయం లో పనిచేస్తున్న గ్రంథ పాలకురాలు సూరేపల్లి లలి త కుమారి కి శనివారం పదోన్నతి లభించింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రేడ్ ×× గ్రంథ పాలకురాలిగా పదోన్నతి లభించింది.ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీ హైదరాబాద్ నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి.గ్రంథ పాలకురాలు లలిత కుమారికి పదోన్నతి లభించడం పట్ల గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, మండల వాసులు, పాఠకులు, చందాదారులు, అధికారులు, ఉద్యోగులు, రాజకీయ పక్షాల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంతమైన కామేపల్లి లో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా పనిచేసి విశిష్ట అందించి గ్రంథ పాలకురాలు వృత్తికే ఆమె వన్నెతెచ్చారని తద్వారా జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొంది ఉత్తమ అవార్డులు పొంది కామేపల్లి శాఖ గ్రంథా లయం కు మంచి పేరును తీసుకువచ్చి పదోన్నతి పొందటం అభినందనీయమని, ఆమె సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులోకి తేవాలి.

- సారపాక బూర్గంపాడు లో చికెన్ ధరలు అందుబాటులో ఉన్నాయి.
- భద్రాచలంలో చికెన్ ధరలు పెంచడానికి కారణం ఎవరు?
- చికెన్ ధరలు తగ్గించకపోతే దశలవారీ ఉద్యమం కొనసాగిస్తాం.
- మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్రాజు డిమాండ్.



**భద్రాచలం మే 29 మీ వార్త:** సారపాక బూర్గంపాడు మండలాల్లో చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉంటే భద్రాచలం పట్టణంలో చికెన్ మార్కెట్లో చికిన్ ధరలు ఎందుకు పెంచారు సమాధానం చెప్పాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. భద్రాచలంలో నివసిస్తున్న ప్రజలు ఏం పాపం చేశారు. సమాధానం చెప్పాలని ఆయన ధ్వజమెత్తారు. ఇతర ప్రాంతాల్లో చికెన్ ధర సామాన్యుడికి అందుబాటులో ఉంటే భద్రాచలంలో మాత్రం సామాన్యుడికి అందుబాటులో లేకుండా చికెన్ వ్యాపారస్తులు సిండికేట్గా మారి నిరుపేదల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇదిలాగే కొనసాగితే మాల మహానాడు ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చికెన్ ధరల నియంత్రణకు కృషి చేయాలని సామాన్యుడికి అందుబాటులోకి చికెన్ ధరలు తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## మా ధాన్యం తేమ చూడండి సారూ .. తహసీల్దార్ ఆఫీస్ ముందు బస్తాలతో రైతులు



నెన్నెల : కాంగ్రెస్ సర్కార్ పాలనలో రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకుందామంటే కష్టాలు తప్పడం లేదు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సారూ మా వడ్లు కాంట చేసి ఇరవై రోజులయింది.. కాంట అయిన బస్తాలను లారిలో ఎక్కించండి అంటే సదరు డీసీఎంస్ నిర్వాహకుడు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదేందీ అని అడిగితే కాంట చేసిన బస్తాలను మరలా వడ్లను కింద పోసి తేమ చూసిన తర్వాతే కాంట చేయాలని అంటున్నారని మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన రైతులు మెండే కిష్టయ్య, కాల్వ రాజాం, బండి రమేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారంతా శనివారం తాసిల్దార్ కార్యాలయం ముందు బస్తాలు తీసుకు వచ్చి వారి ఆవేదనను తహసీల్దార్ శ్రీనివాస్‌కు చెప్పుకున్నారు. సారు వాళ్లు పట్టించు కోవడం లేదు మీరన్నా మా వడ్లను తేమ చూసి పంపండి.. అంటూ వేడుకున్నారు. పలుకుబడి ఉన్న వాళ్ళవి తేమ కూడా చూడడం లేదని తమ వడ్లు ఎండలకు ఎండి తేమ 9 వరకు వచ్చిందని రైతులు చెప్పారు. మే 10న కాంట అయిన బస్తాలను ఖాళీ చేయమంటే ఎలా సారు. మళ్లీ కాంట చేస్తే హమాలీ ఛార్జీలు మా మీదనే పడుతున్నాయని ఆందోళన చెందారు. ఇది కావాలనే మమ్ములను వేదిస్తున్నారని ఒక వేళ తమ బస్తాలను లోడింగ్ చేయకుంటే మమ్ములను వేధిస్తున్న వారి పేర్లు రాసి ఇక్కడే చస్తామని కన్నీరు పెట్టారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని రైతులకు నచ్చజెప్పారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్ కాసర్ల పద్మకు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ కన్నీటి నివాళి




**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మకు మున్సిపల్ కౌన్సిల్ కన్నీటి నివాళి అర్పించింది. ఈ మేరకు శనివారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. గుండెపోటుతో బీఆర్ఎస్ కౌన్సిలర్ కాసర్ల పద్మ శుక్రవారం ఉదయం హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిల్ కౌన్సిల్ సమావేశంలో మొదటగా కౌన్సిలర్ కాసర్ల పద్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతి కౌన్సిల్‌కు తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్ పద్మ సంతాపకంగా సమావేశాన్ని నిర్వహించి అనంతరం సమావేశాన్ని జూన్ 3వ తేదీకి వాయిదా వేశారు.

## ఓటీటీలో దూసుకెళ్తున్న 'డ్రింకర్ సాయి'



ధర్మ మహేష్ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ మహేశ్ హీరోగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 2024 డిసెంబర్‌లో థియేటర్స్‌లో విడుదలై యావరేజ్ టాక్ సంపాదిం చుకుంది. కానీ దాదాపు ఏడాదిన్నర ఓటీటీలోకి వచ్చి.. ఇక్కడ మంచి టాక్‌తో దూసుకెళ్తోంది. జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ఫ్రీ ఆన్ జీ5 విభాగంలో టాప్-1 ట్రెండింగ్ మూవీగా దూసుకుపోతూ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమాలో ఒక సాధారణ యువకుడి జీవితంలో జరిగే పరిణామాలను, అతని ప్రేమ, ఆత్మగౌరవం, భావోద్వేగ సంఘర్షణలను ధర్మ మహేష్ ఎంతో నేచురల్‌గా నటించారు. కొన్ని కీలక సన్నివేశాల్లో ఆయన ఎక్స్‌ప్రెషన్స్, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. అందుకే థియేటర్లలో మంచి పేరు తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో మరింత పెద్ద స్థాయిలో ఆదరణ పొందుతోంది. అలాగే ఈ చిత్రంతో బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా దుబాయ్‌లో జరిగిన గామా అవార్డ్ అందుకున్నారు ధర్మ మహేష్. హీరోయిన్‌గా నటించిన ఐశ్వర్య శర్మ తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఆమెకు ధర్మ మహేష్‌తో ఉన్న కెమిస్ట్రీ సినిమాకు మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అలాగే రీతూ చౌదరి, పోసాని కృష్ణ మురళీ, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, భద్రం, కిర్రాక్ సీత, ఫన్ బకెట్ రాజేష్, రాజ ప్రజ్వల్ తదితరులు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేసి కథను మరింత బలపరిచారు.





## సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో మ్యూజికల్ కామెడీ.. 'రోమాంచకం' ఫస్ట్ లుక్ రిలీజ్

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు.

భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్' (రాజూఅతీత్) 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లలో ప్రభాస్ షర్ట్‌లెస్ లుక్‌లో, ఒంటిపై గాయాలు, బ్యాండేజీలతో కనిపించి అభిమానుల్లో భారీ అంచనాలను పెంచేశారు. లాంగ్ హెయిర్, గడ్డం, మీసాలతో ఉన్న ప్రభాస్ లుక్.. సందీప్ వంగా మునుపటి చిత్రం 'యానిమల్'లో రణబీర్ కపూర్ లుక్‌ను గుర్తుచేసేలా ఉందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాలో తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు.

## రూ.300 కోట్ల క్లబ్‌లోకి 'కరుప్పు'.. బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న సూర్య డివైన్ బ్లాక్‌బస్టర్

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాల విజయవంతమైన రన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మూడో వారంలోకి కూడా అదే జోరుతో అడుగుపెట్టింది. సాధారణంగా పెద్ద సినిమాల వసూళ్లు రెండో వారానికే తగ్గుముఖం పడుతుంటాయి. కానీ 'కరుప్పు' మాత్రం వీక్‌డేస్‌లో కూడా బలమైన కలెక్షన్లు నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జి.కె. విష్ణు అందించిన అద్భుతమైన విజువల్స్ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. మూడో వారంలో కూడా థియేటర్లలో బలమైన ఆక్యుపెన్సీ కొనసాగుతుండటంతో ఈ చిత్రం ఫైనల్ రన్ ముగిసే సమయానికి మరిన్ని చారిత్రాత్మక రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్య కెరీర్‌లోనే కాకుండా, తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.




## 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్ రిలీజ్.. జూన్ 22 నుండి స్ట్రీమింగ్!




హాలీవుడ్ పాపులర్ ఫాంటసీ డ్రామా సిరీస్ 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. వెస్టరోస్ సామ్రాజ్యంలో ఐరన్ థ్రోన్ కోసం జరిగే భీకర పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. రక్తపాతం లేకుండా కింగ్స్ ల్యాండింగ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రైలర్ ప్రారంభంలో రాన్యా టార్గేరియన్ చెప్పినప్పటికీ, పరిస్థితులు దానికి భిన్నంగా మారి ఆమె తన డ్రాగన్లు, సైన్యంతో నగరాన్ని ముట్టడించడం, అది అగ్నికీలల్లో చిక్కుకోవడం ఇందులో చూపించారు. ముఖ్యంగా అత్యంత రక్తపాతంతో కూడిన నౌకా యుద్ధంగా పేరొందిన 'బాటిల్ ఆఫ్ ది గల్లెట్'ను ఈ సీజన్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ క్రేజీ సిరీస్ భారతదేశంలో జూన్ 22 నుంచి 'జియోహాట్‌స్టార్' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## యాక్షన్ మోడ్‌లో కరిష్మా కపూర్.. ఆసక్తికరంగా 'బ్రౌన్' ట్రైలర్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, "రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఆమెలో ఎన్నో లోపాలు, బలహీనతలు ఉన్నప్పటికీ, జీవితంలో ముందుకు సాగే పట్టుదల ఉంది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి" అని పేర్కొన్నారు. అలాగే నటుడు జిష్షూ సేన్‌గుప్తా మాట్లాడుతూ, ఈ సిరీస్ కేవలం ఒక సాధారణ సస్పెన్స్ థ్రిల్లర్‌లా కాకుండా, ప్రతి పాత్రలోనూ ఎంతో లోతు, భావోద్వేగాలు ఉంటాయని, కోల్‌కతా నగరం ఈ కథలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచిందని చెప్పారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.

